సాక్షి పల్నాడు

శనివారం । 14 । డిసెంబర్ । 2024



ఘనంగా ఆలయ వార్షికోత్సవం


రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ 33వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్నారు.



వైభవంగా కృత్తికా దీపోత్సవం


రేపల్లె రూరల్: మార్గశిర మాసం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇసుకపల్లిలోని చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివలింగాకృతిలో దీపాలను భక్తులు వెలిగించారు.

భక్తితో హనుమద్ వ్రతం



మంగళగిరి: నగర పరిధిలోని హనుమంతుడి ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. హనుమద్ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంటల బీమాతో ఆదుకోవాలి



నేను పది ఎకరాలు మిరప పంట సాగు చేస్తే సగానికి పైగా ఇప్పటికే పూర్తిగా దెబ్బతింది. రక్షించుకునేందుకు అదనంగా ఖర్చు చేస్తున్నా ప్రయోజనం లేకుండా ఉంది. పంట బీమా ద్వారా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. లేనిపక్షంలో వేలాది మంది అప్పుల ఊబిలో కూరుకుపోతారు.

– శీలం సైదారెడ్డి, మండాది, వెల్దుర్తి మండలం

రైతులను మోసం చేసిన కూటమి



పంటలకు మద్దతు ధర కల్పించి రైతులకు అండగా నిలవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. అన్నదాత సుఖీభవ ద్వారా సంవత్సరానికి రూ.20వేలు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి ఇప్పుడు దాని గురించి మాట్లాడటం లేదు. పంటల బీమాను సైతం గత ప్రభుత్వమే చెల్లించింది. కూటమి ప్రభుత్వం రైతులపై భారం మోపుతోంది.

– పొలం కోటిరెడ్డి, ముప్పాళ్ల, ఈపూరు మండలం.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



వరి అక్కడక్కడా కోతలు ప్రారంభించారు. ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించలేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. బస్తాకు రూ.300లు దాకా రైతులు కోల్పోవాల్సి వస్తుంది. దీని వల్ల ఎకరానికి రూ.12వేలు వరకు నష్టపోతున్నారు. ప్రభుత్వం వెంటనే కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేయాలి.

– ఇక్కుర్తి కృష్ణ, కుంకులగుంట, నకరికల్లు మండలం

రైతులకు అండగా గత ప్రభుత్వం



వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాలా అండగా నిలిచారు. ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి విత్తనాల నుంచి ఉత్పత్తులను విక్రయించే వరకు తోడ్పాటును అందించారు. ప్రస్తుత ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి లేదు. విత్తనాలు, ఎరువులు కొరతతో పాటు ధాన్యం విక్రయించాలన్నా దళారులపై ఆధారపడాల్సి వస్తోంది.

– టి.వెంకట్రావు, రూపెనగుంట, నకరికల్లు మండలం

ప్రభుత్వమే ఆదుకోవాలి



నేను ఆరు ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. బొబ్బర తెగులు కారణంగా దెబ్బతింది. ఎకరానికి ఇప్పటి వరకు రూ.లక్ష వరకు ఖర్చు పెట్టా. పెట్టుబడి రూపాయి కూడా వచ్చే అవకాశం లేదు. పూర్తిగా నష్టపోయా. ప్రభుత్వమే మిరప రైతులను ఆదుకోవాలి.

– వెన్నపూసల జగన్మోహనరెడ్డి, కాచవరం, కారంపూడి మండలం

ధర పతనంతో కుదేలు



గత ఏడాది 10 ఎకరాల్లో మిరప సాగు చేశా. 250 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అధిక ధర వస్తుందనే ఆశతో కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచా. అప్పట్లో తేజ రకం క్వింటా రూ.18వేలు ఉండగా ప్రస్తుత ధర రూ.14వేలు మాత్రమే ఉంది. మద్దతు ధర కల్పించకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

– కామిరెడ్డి లింగారెడ్డి, మండాది, వెల్దుర్తి మండలం

హలధారి పోరుబాట

కూటమి ప్రభుత్వ మోసంపై అన్నదాతలు నిప్పులు చెరిగారు. కాడి పట్టిన చేతులు పిడికిళ్లు బిగించి పోరుబాట పట్టాయి. ఆరుగాలం శ్రమించి, కన్నబిడ్డలా సాగిన పంటలకు మద్దతు ధర లభించకపోవడంతో ఆగ్రహం పెల్లుబికింది. రైతుల ధర్మాగ్రహానికి వైఎస్సార్ సీపీ బాసటగా నిలిచింది. రైతుల గొంతుకలో ధిక్కార స్వరమైంది. వారికి అండగా నిలిచింది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పిలుపుతో రైతులు కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చారు. కూటమి ప్రభుత్వ వైఫల్యంపై నిరసన గళం విప్పారు.

రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ర్యాలీ

అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ

- భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు, రైతులు
- కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టిన జిల్లా నేతలు
- రైతుల పక్షాన నిరంతర పోరాటాలు చేసి అండగా నిలుస్తామని భరోసా
- ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్
- ర్యాలీని అడుగడుగునా అడ్డుకొనేలా ప్రయత్నించిన పోలీసులు
- ర్యాలీ అనంతరం జేసీకి వినతిపత్రం అందజేసిన నేతలు

సాక్షి, నరసరావుపేట : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో అన్నదాతకు అండగా కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు ఎండగట్టారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు ప్రతి దశలో వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని, వారి పక్షాన నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. గుంటూరు రోడ్డులోని నియోజకవర్గ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ద్విచక్రవాహనంపై ర్యాలీగా తరలివచ్చారు. దీంతో ఆ మార్గంలోని ప్రధాన వీధిలో సందడి నెలకొంది. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, కాసు మహేష్‌రెడ్డి, నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో వందలాది మంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కదంతొక్కి రైతులకు భరోసానిచ్చారు. ర్యాలీలో కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కర్షకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం పార్టీ ముఖ్యనేతలు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్‌కు వినతిపత్రం అందజేశారు. తరువాత కలెక్టరేట్ ప్రాంగణంలో మీడియాతో నేతలు మాట్లాడారు.

అబద్ధాలతో కూటమి ప్రభుత్వం మోసం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాచర్ల మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నాయకులు అబద్ధాలతో ప్రజలను మోసంచేసి అధికారంలోకి వచ్చారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన తరువాత రైతులతోపాటు అన్ని వర్గాలను దారుణంగా మోసం చేశారని విమర్శించారు. ఖరీఫ్, రబీ సీజన్‌లు ముగిసినా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా సహాయం చేయకుండా రైతులను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. రైతు ధాన్యాన్ని



కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, కాసు మహేష్, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు తదితరులు



ప్లకార్డులు పట్టుకొని కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్న నేతలు

మద్దతు ధర రూ.1,750కు కొనాల్సి ఉండగా, రూ.1,300 కొంటున్నారని తెలిపారు. రైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. గత ఆగస్టులో విత్తనాలు, ఎరువుల కోసం నరసరావుపేటలోని టౌన్ హాలులో రైతులు బారులు తీరారని, గత ఐదేళ్ల తమ ప్రభుత్వంలో చూడలేదని తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా వారికి కావాల్సినవి ప్రభుత్వమే ఇళ్ల వద్దకు అందజేసిందని గుర్తు చేశారు.

హామీలు అమలు చేసే వరకు పోరాటం

మాజీ మంత్రి విడదల రజని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు మంగళం పాడిందని ధ్వజమెత్తారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పంటలకు నష్టపరిహారం సక్రమంగా అందడం లేదని తెలిపారు. రైతు రాజుగా ఉండాలని భావించి వారికి అన్ని రకాలుగా అండగా నిలిచిన వ్యక్తి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఆయన హయాంలో ఆర్‌బీకేలు ఏర్పాటుచేసి విత్తనాలు, ఎరువులు మొదలు వారు పండించిన పంటలను ప్రభుత్వమే కొనేందుకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, లేనిపక్షంలో వారి తరపున పార్టీ పోరాడుతుందని హెచ్చరించారు.

కూటమి పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఈ ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీలలో భాగంగా వారికిచ్చిన ప్రతిహామీని అమలు చేసే దాకా పోరాడుతామని తెలిపారు. విద్యుత్ బిల్లులు పెంచలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల మీటింగ్‌లో, మంత్రి గొట్టిపాటి ప్రకటనలు ఇస్తున్నారని, కానీ ప్రజలకు వచ్చే బిల్లులతో నిజమేంటో తెలుస్తుందని తెలిపారు. ఆరునెలల బిల్లుకు, రేపు వచ్చే బిల్లుకు తేడా చూస్తే తెలిసిపోతుందని పేర్కొన్నారు.

రైతులకు దిక్కు లేకుండా చేసిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్‌బీకేలు పనిచేయట్లేదని, ఎరువులు మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న సీఎంగా ఉన్న సమయంలో రైతులు పండించిన ప్రతి పంటకు మంచి ధర లభించి లాభపడ్డారన్నారు. కానీ చంద్రబాబు అధికారంలో ఉంటే మాత్రం ధరలు అమాంతం పడిపోతుంటాయని ఎద్దేవా చేశారు. రైతు పండించిన పంటలకు ధరలు తగ్గినా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని విమర్శించారు. నిద్రపోతున్న ప్రభుత్వం, అధికారులను మేల్కొలపాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ప్రజలు కూటమి పార్టీలను అధికారంలోకి తెస్తే వారు మాత్ర తీవ్రంగా మోసం చేస్తున్నారని అన్నారు. రైతులు, రైతుకూలీలు, చిన్న, సన్నకారు వర్గాల వారు తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పేప్రయత్నం చేస్తే జైలు పాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం అంటేనే జైలు గుర్తుకొచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు పెంచామని వారే చెబుతారు.. మరోసారి పెంచలేదంటారని ఎద్దేవా చేశారు. నిజంగా అర్హతలేనివారికి పింఛన్ తొలగించటంలో న్యాయముందని, వైఎస్సార్ సీపీ వారినే టార్గెట్ చేసి తీసివేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని మండిపడ్డారు.

మోసం చేసిన కూటమి ప్రభుత్వం

పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు నంబూరి శంకరరావు మాట్లాడుతూ రైతులు పండిస్తేనే అందరమూ అన్నం తినే పరిస్థితి ఉండగా.. వారికే ప్రభుత్వం అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీలో రైతు భరోసా ఇచ్చారని, కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తారని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. సూపర్ సిక్స్ అంటూ హామీలిచ్చి ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆయన మండిపడ్డారు.

అడుగడుగునా అడ్డంకులు

ఎన్నికల హామీలను అమలుచేయాలన్న డిమాండ్‌తో వైఎస్సార్‌సీపీ చేసిన నిరసన కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించింది. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ర్యాలీ కోసం అనుమతి కోరినప్పటికీ రావొద్దంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేసే ప్రయత్నం చేశారు. పార్టీ జిల్లా కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డులోకి ప్రవేశించే మార్గంలో ఏర్పాటుచేసిన బారికేడ్ల వద్ద కొంత తోపులాట జరిగింది. పెద్దసంఖ్యలో వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆంక్షలు ఛేదించుకొని కలెక్టరేట్ వైపు ర్యాలీగా వెళ్లారు. పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా నినిదాల చేశారు. కలెక్టరేట్ గేట్లను మూసి కార్యకర్తలను అడ్డుకొని కేవలం ఐదారుమంది నేతలకు మాత్రమే అనుమతి ఉందంటూ పోలీసులు ఆంక్షలు పెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పడాల సాంబశివారెడ్డి, దేవెళ్ల రేవతి, పీఎస్ ఖాన్, చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, భవనం రాఘవరెడ్డి, చిట్టిబాబు, ఈఎం స్వామి, మరియమ్మ, కందుల ఎజ్రా పాల్గొన్నారు.



కలెక్టరేట్ గేట్లు మూసివేసి కార్యకర్తలు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



జిల్లా పార్టీ కార్యాలయానికి ర్యాలీగా ద్విచక్రవాహనంపై వస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, లోక్ అదాలత్ చైర్మన్ ఎస్. సత్యశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్, చెల్లని చెక్కు, బ్యాంక్, రెవెన్యూ, మోటార్ వాహన ప్రమాదాలు, మనోవర్తి, కుటుంబ తగాదాలు, ముందస్తు వ్యాజ్యపు కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవాలని ఆమె సూచించారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు రాజీ చేసుకున్నట్లయితే కోర్టు ఫీజు వాపస్ ఉంటుందని సత్యశ్రీ తెలిపారు.

కందుల రైతులు 16లోగా నమోదు చేసుకోవాలి

నరసరావుపేట: ఈ–క్రాప్‌లో నమోదు చేసుకొని, విక్రయించదల్చుకున్న కందుల రైతులు ఈనెల 16వ తేదీలోగా సమీపంలోని ఆర్‌బీకేలలో సీఎం యాప్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన కందులను ఎంఎస్‌పీ/డీబీపీపీ పద్ధతిలో బహిరంగ మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధరతో ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు ఆర్‌బీకేలను రైతులు సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంపై దాడి

- పులివెందులలో సాక్షి ప్రతినిధులపై దాడిని ఖండించిన జర్నలిస్టు, ప్రజాసంఘాలు
- కలెక్టరేట్ వరకు ర్యాలీ
- జేసీకి వినతిపత్రం అందజేత
- దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: జర్నలిస్టులపై దాడి అంటే పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్లేనని పలువురు జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కడప జిల్లా పులివెందులలో సాగునీటి సంఘాల కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన సాక్షి టీవీ జిల్లా రిపోర్టర్ శ్రీనివాస్, కెమెరామేన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిలపై అధికార టీడీపీ కూటమి నేతలు దాడి చేసి గాయపర్చటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం), ఎంబిఎం, పీకేఎస్ నాయకులు, పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, ఎంబిఎం నాయకుడు షేక్ మౌలాలి, జర్నలిస్టులు సీహెచ్.వి.రమణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, బి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో స్తంభమైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాపై దాడిని సభ్య సమాజం, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై పదే పదే దాడులు జరగకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని, వారికి భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు నినాదాలు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు టి.లవకుమార్‌రెడ్డి, సుంకురెడ్డి, ఎం.లక్ష్మయ్య, పి.వి.కోటిరెడ్డి, నాగరాజు, షేక్ కరీముల్లా, బుచ్చిబాబు, పాదర్తి ప్రసాద్, ఏ.రమేష్, షేక్ షాహిద్, రామాంజనేయులు, నల్లపాటి రామారావు, బాదుగున్నల శ్రీను, పీకేఎస్ నాయకుడు కంబాల ఏడుకొండలు, కొణిజేటి రమేష్ పాల్గొన్నారు.

నగదు రహితంగా ఎన్‌టీఆర్ వైద్య సేవ : జేసీ

నరసరావుపేట: ఎన్‌టీఆర్ వైద్యసేవ కోసం వచ్చే పేషెంట్లకు బిల్లులు లేకుండా నగదు రహిత వైద్యం అందించేలా ఆసుపత్రి యాజమాన్యంచర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భం

72 ఫిర్యాదులకు పరిష్కారం

గా 72 ఫిర్యాదులను కమిటీ సభ్యులు విచారణ చేసి పరిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జి.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సమీక్ష చేస్తున్న జేసీ

ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

నరసరావుపేట: ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఆ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం నుంచి నిర్వహించనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో శుక్రవారం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ, స్టార్ రేటింగ్ కలిగిన గృహోపకరణాలు వాడటం వల్ల విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. అవసరంలేని సమయంలో లైట్లు స్విచ్ఆఫ్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్స్ పెట్టుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను తమ ప్రభుత్వం పెంచలేదని పేర్కొన్నారు. విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ కోరారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు ప్రత్తిపాటి విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబొట్లు, సోలార్ పవర్ వినియోగదారులు పచ్చవ వెంకటేశ్వర్లు, ఈఆర్వో సీనియర్ అసిస్టెంట్ ఆర్.బంగారయ్య పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే చదలవాడ, అధికారులు

సీఐటీయూ ఆధ్వర్యంలో కరెంటు బిల్లుల దహనం

పిడుగురాళ్ల: పెంచిన కరెంటు చార్జీలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో శుక్రవారం బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంట్ బిల్లుల పెంపుదల చేయమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే ప్రజలపై యూజర్ చార్జీల పేరుతో భారాలు మోపుతోందని విమర్శించారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలు వెనక్కి తీసుకోవాలని, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణ బిల్లును కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ బాబు, గుదే బిక్షాలు, జి. నాగేశ్వరరావు, కొమ్ము పుల్లయ్య, కనకారావు, షేక్‌మాబు, హసాన్‌వలి, మురికిపూడి చిన్న, ధీరు నాయక్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



బిల్లులను తగలబెడుతున్న సీఐటీయూ నాయకులు

క్లుప్తంగా

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



వినుకొండ: పట్టణంలోని డిగ్రీ కళాశాల సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒంటిపై తెల్లని చారల చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. వయస్సు 50 సంవత్సరాలు ఉంటాయి. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: మహిళపై అత్యాచారానికి పాల్పడి, బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దిశ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు రోడ్డులోని ఓ ప్రాంతంలో బడ్డీ కొట్టు నిర్వహించే మహిళకు రెండు సంవత్సరాల క్రితం వెంగళాయపాలెంకు చెందిన దేవరకొండ నాగేశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. మహిళను శారీరకంగా లొంగదీసుకున్న నాగేశ్వరరావు.. వీడియో చిత్రీకరించారు. దానిని చూపించి బెదిరిస్తూ బాధితురాలి నుంచి పలు దఫాలుగా డబ్బులు వసూలు చేశాడు. తరచూ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత మహిళకు వివాహమై ఇరువురు సంతానం ఉన్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే భర్తతోపాటు బిడ్డలను చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ధనుర్మాస మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాల పోస్టర్‌ను మంగళగిరి పట్టణ వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పాత మంగళగిరి శ్రీ కృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం ఈ కార్యక్రమం ఆ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు నందం జోగేంద్ర చక్రవర్తి మాట్లాడుతూ శ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలలో భాగంగా ఈ నెల 17వ తేదీన అమ్మవారికి సారె సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం జీయర్ స్వామి చేతుల మీదుగా తీర్థ గోష్ఠి, సాయంత్రం స్వామివారి అనుగ్రహ భాషణ, స్వామివారి శిష్యులు గోదాదేవి అమ్మవారి వైభవాన్ని కీర్తిస్తూ నిర్వహించే పలు కార్యక్రమాలు జరుగనున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వికాస తరంగిణి ప్రతినిధులు విజయలక్ష్మి, డోగిపర్తి శ్రీహరిరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలను అభివృద్ధి చేస్తాం

- మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్, ఐసీయూలు ప్రారంభం



బ్లడ్ బ్యాంకు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

నరసరావుపేట: స్థానిక ప్రభుత్వ వైద్యశాల పూర్తి స్థాయిలో పనిచేసేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి చేస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రూ.2.5కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్, పది బెడ్ల ఐసీయూను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో కలిసి ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి మాట్లాడుతూ రెడ్ క్రాస్ ప్రతినిధులు, దాతల సహకారం, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ సహకారంతో అధునాతన సదుపాయాలతో బ్లడ్‌సెంటర్ ఏర్పాటుచేయటం అభినందనీయమని తెలిపారు. పల్నాడు జిల్లాతో పాటు చుట్టుపక్కల ఉన్న ప్రాంతవాసులకు బ్లడ్ సెంటర్ వరం లాంటిదని పేర్కొన్నారు. జాతీయ రహదారులు దగ్గరగా ఉన్నందు వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉంటాయని, బాధితులకు రక్తం అవసరం ఎంతైనా ఉంటుందని తెలిపారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులకు కరెంట్ బిల్లు విషయంలో సబ్సిడీని అందించేందుకు ప్రభుత్వంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు కష్టపడి విరాళాలు సేకరించి నిర్మాణం పూర్తి చేశారని తెలిపారు. ఆర్డీవో కార్యాలయ కాంపౌండ్‌లో ఉన్న స్థలంలో నూతన భవనాన్ని నిర్మించి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం బ్లడ్ సెంటర్ నిర్మాణానికి విరాళాలు అందించిన సూర్యప్రభ, మెదరమెట్ల రామశేషగిరిరావు, డాక్టర్ వివేకానందరెడ్డి, బుచ్చయ్య చౌదరి, పాలడుగు పుల్లారావు, జీవీఎస్ రాము, అమరా రాంబాబులను మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే చదలవాడ సన్మానించారు. కార్యక్రమంలో దరిశి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డీఆర్వో ఏ.మురళి, జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ శరత్ బాబు, కోశాధికారి గంద్రకోట మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గజ్జల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

మంద కృష్ణకు మతిభ్రమించింది

- 15న మహాగర్జనలో మాలలు సత్తా చాటాలి
- ఏజీ జేఏసీ కన్వీనర్ అన్నవరపు కిషోర్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కిషోర్ తదితరులు

తెనాలి: తెలంగాణ మాల సింహ గర్జన చూసి మందకృష్ణకు మతిభ్రమించిందని, ఏడో తరగతి చదివిన మందకృష్ణ.. మాల మేధావులను చర్చలకు పిలవడం హాస్యాస్పదమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, అఖిలభారత మాల సంఘాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ వ్యాఖ్యానించారు. ఈ నెల 15న గుంటూరులో జరిగే మాలల మహాగర్జన సభను జయప్రదం చేయాలని కోరుతూ జనసమీకరణలో భాగంగా శుక్రవారం ఆయన తెనాలి వచ్చారు. స్థానిక అయితానగర్‌లోని మాలల మహా గర్జన జేఏసీ కార్యాలయంలో 'హలో మాల–చలో గుంటూరు' కరపత్రాన్ని ఆవిష్కరించారు. అక్కడే విలేకరులతో మాట్లాడుతూ, వర్గీకరణపై సుప్రీం కోర్టు ఆగస్టు ఒకటిన సూచనలు మాత్రమే చేసిందని గుర్తుచేశారు. దీనిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం దీనిపై కమిషన్ నియామకాన్ని కూడా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్ ఫలాలను మాలలు అనుభవిస్తూ దోచుకుతింటున్నారని 30 ఏళ్ల నుంచి మందకృష్ణ నమ్మిస్తూ విష ప్రచారంతో పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా గలిగిన మాలలు ఈ నెల 15వ తేదీన గుంటూరులో జరిగే మహా గర్జన సభలో తమ సత్తా చాటుతారని అన్నారు. జేఏసీ నాయకుడు యంద్రపాటి అశోక్ కుమార్, జేఏసీ మాల నాయకుడు బండికళ్ల బుల్లయ్య , బి.ప్రదీప్, డాక్టర్ కారుమంచి రవికుమార్, కంచర్ల కోటేశ్వరరావు, కె. సునీల్, జ్యోతుల బాబి, పిల్లి ప్రేమ్‌కుమార్, కొల్లూరి కిరణ్, పిల్లి తిమోతి, గడ్డేటి సుందర సునీల్, పిల్లి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు ఎస్టీయూ సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో విద్యా సదస్సు, గుంటూరు జిల్లా శాఖ 78వ వార్షిక సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నూరు మండలం చింతలపూడిలోని మొవ్వా గార్డెన్స్‌లో నిర్వహించనున్న సదస్సులో పలు సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి, ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు పాల్గొంటారని పేర్కొన్నారు.

యార్డులో 49,486 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు శుక్రవారం 42,677 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 49,486 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 7,500 నుంచి రూ. 14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 36,575 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

ఫెర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్‌తో పాటు సీఐలు కె.చంద్రశేఖర్, పి. శివాజీ, విజిలెన్స్ ఏవో ఆదినారాయణల బృందం స్థానిక ఏవో కె. అరుణకుమారితో కలిసి మంజునాథ ట్రేడర్స్, పయనీర్ ఆగ్రోస్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేసింది. రికార్డులు, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లును పరిశీలించారు. ఎస్పీ స్వయంగా గోడౌన్లకు వెళ్లి తనిఖీ చేశారు. స్టాకు వ్యత్యాసం ఉండటాన్ని గమనించారు. దీంతో మంజునాథ ట్రేడర్స్‌లో రూ. 2,02,348 విలువ చేసే 11.36 మెట్రిక్ టన్నుల ఎరువులు, పయనీర్ ఆగ్రోస్‌లో రూ. 1,96,300 విలువ చేసే 11.5 మెట్రిక్ టన్నుల ఫెర్టిలైజర్స్‌ను సీజ్ చేసినట్లు వ్యవసాయాధికారి అరుణ కుమారి తెలిపారు. దుకాణాల నిర్వాహకులపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

నగరంపాలెం: బాపట్ల జిల్లాలోని చీరాలలో శ్రీఅన్నపూర్ణ ఫెర్టిలైజర్స్, ఎం/ఎస్ సుభాష్ జనరల్ స్టోర్, శ్రీసుబ్రమణ్యేశ్వర ఫెర్టిలైజర్‌లో 52.65 ఎంటీఎస్ ఎరువులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయాలని సూర్యశ్రావణ్‌కుమార్ సూచించారు. సుమారు రూ.9.60 లక్షల విలువ చేసే 75.71 ఎంటీఎస్ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో అధికారి సూర్యశ్రావణ్‌కుమార్, వ్యవసాయ అధికారి సీహెచ్ ఆదినారాయణ, విజిలెన్స్ సీఐలు కె.చంద్రశేఖర్, పి.శివాజీ, సైదులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ జిల్లా అధ్యక్షుడు బందగీ సాహెబ్



కలెక్టరేట్‌లో జేసీ సూరజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బందగీ సాహెబ్, వీఆర్‌ఏలు

నరసరావుపేట: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సీఐటీయు) పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను కలిసి వినతి పత్రం అందజేశారు. బందగీ సాహెబ్ మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో 23 అటెండర్ పోస్టులు,11 నైట్ వాచ్‌మేన్ పోస్టులు, గురజాల డివిజన్ పరిధిలో 21 అటెండర్ పోస్టులు, ఏడు నైట్ వాచ్‌మేన్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఏళ్ల తరబడి వాటిని భర్తీ చేయకపోవడంతో వీఆర్‌ఏలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆయా పరిధిలోని ఆర్డీవోలు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీచేయాలని డిమాండ్ చేశారు. అటెండర్, నైట్ వాచ్‌మేన్ పోస్టుల భర్తీకి కృషి చేస్తానని, దీనిపై సంబంధిత ఆర్డీవోలకు సర్కులర్ జారీ చేస్తానని జేసీ హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం డీఆర్వో మురళిని కలిసి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో నరసరావుపేట మండల అధ్యక్షుడు రోశయ్య, కోశాధికారి సాంబయ్య, మండల ప్రధాన కార్యదర్శి రఫీ, నకరికల్లు మండల అధ్యక్షుడు కాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రవి, మండల ప్రధాన కార్యదర్శి మునాఫ్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

బాలల హక్కులు, సంరక్షణే ధ్యేయం

కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

నరసరావుపేట: బాలల హక్కులతో పాటు సంరక్షణ చట్టాలను అమలు పరిచే విధంగా అధికారులంతా క్షేత్రస్థాయిలో అంకితభావం, దృఢమైన సంకల్పంతో కృషి చేస్తేనే నేరాలు నివారించగలుగుతామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. పట్టణంలోని ఎన్జీవో కాలనీలో ఉన్న శిశు గృహ, సఖి వన్‌స్టాప్ సెంటర్‌లను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతో పాటు వసతులు, ఏర్పాట్లు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో మహిళలు, పిల్లలు రక్షణ, సంరక్షణ కోసం అధికారులు, ఎన్జీవోలు సమష్టితో, సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ అక్కడక్కడా నేరాలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 112, 181, డయల్ 100పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

17న ఎయిమ్స్‌కు రాష్ట్రపతి

- ప్రథమ స్నాతకోత్సవానికి హాజరు కానున్న ద్రౌపది ముర్ము
- ఏర్పాట్లపై జిల్లా అధికారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచనలు



ఎయిమ్స్‌లో ఆడిటోరియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎయిమ్స్ అధికారులు

లక్ష్మీపురం: మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రథమ స్నాతకోత్సవానికి ఈ నెల 17వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై ఎయిమ్స్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎయిమ్స్ డైరెక్టర్ డా.మాదభనందకర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహలు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పలువురు ప్రముఖులు కూడా పాల్గొంటున్నందున భద్రతాపరంగా కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం జరగబోయే ఆడిటోరియాన్ని పరిశీలించారు. విజయవాడ నుంచి ఎయిమ్స్‌కు రోడ్డు మార్గాన రాష్ట్రపతి రానున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషాను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణకు నియమించే వివిధ కమిటీల ఏర్పాట్లపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు. విధులు సక్రమంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్రీమంతకుమార్ దాస్, డీసీహెచ్ ఎస్ మయానా మజీదాబి, ఆర్‌అండ్‌బీ ఈఈ విశ్వనాథ్ రెడ్డి , జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ డా కె.విజయలక్ష్మి, డీఎస్‌ఓ పి.కోమలి పద్మ, పౌర సరఫరాల శాఖ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.లక్ష్మి, ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నటరాజ్, అడిషనల్ ప్రొఫెసర్ శంకరన్, ఐపీఆర్ ఆర్‌జేడీ ఐ.సూర్యచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

మంగళగిరి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో మంగళగిరి ఎయిమ్స్ రోడ్డులో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది కంప చెట్లు తొలగించారు. రోడ్డును శుభ్రపరిచారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ అలీంబాషా పనులను పర్యవేక్షించారు.

అందుబాటులో సహాయక సిబ్బంది

జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: 'పొలాల్లో ధాన్యం... పోరే శరణ్యం' శీర్షికన 'సాక్షి' గుంటూరు జిల్లా ఎడిషనులో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసిన ప్రతి క్లస్టర్‌లోనూ టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు వంటి సహాయక సిబ్బంది అందుబాటులో ఉంటారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ వెల్లడించారు. ధాన్యం సేకరణకు ప్రొక్యూర్‌మెంట్ ఏజెన్సీగా నియమించిన జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ ఆ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోనె సంచులు, రవాణా సదుపాయాలు రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచామన్నారు. కొల్లిపర మండలం తూములూరు రైతు సేవా కేంద్రం ద్వారా 117 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.28 లక్షలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలియజేశారు. రైతులెవరూ దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, రైతు సేవా కేంద్రాలలో కనీస మద్దతు ధరకు విక్రయించాలని కోరారు. సమస్యలు ఎదురైతే నేరుగా జిల్లా కంట్రోలు రూము 94913 92717 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 156 రైతు సేవా కేంద్రాలను ధాన్యం కొనుగోలు నిమిత్తం 45 క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటు చేశామని వివరించారు.

ఫారెస్ట్రీ కోర్సుతో ఉజ్వల భవిష్యత్తు

రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తదితరులు

ఏఎన్‌యూ: ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ కోర్సు చేసిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం అన్నారు. యూనివర్సిటీ వృక్ష శాస్త్రం, ఫారెస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం హెర్బల్ గార్డెన్‌లో షెడ్ నెట్, పాలీహౌస్‌లను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఫారెస్ట్రీ కోర్సు నడుపుతున్న ఏకైక విశ్వవిద్యాలయం తమదేనన్నారు. విద్యార్థులు కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసమే చూడకుండా స్వయంగా స్టార్టప్‌లు ఏర్పాటు చేసి అనేక మందికి ఉపాధి కల్పించాలని సూచించారు. విశిష్ట అతిథిగా ఐఎఫ్‌ఎస్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ.. పెరిగిపోతున్న కాలుష్యం వలన భూతాపం పెరిగి వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి కాప్ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టులో ఏపీ బయోడైవర్సిటీ బోర్డు జీవ వైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంఎస్సీ ఫారెస్ట్రీ విభాగాధిపతి ఆచార్య కె..మల్లికార్జున మాట్లాడుతూ ఏపీ ఫారెస్ట్రీ విభాగంతో సంయుక్తంగా ఈ కోర్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ అమృతవల్లి, డాక్టర్ మాధవి, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ పీఎస్ రాజు, పలువురు అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజస్థాన్, ఉత్తరాఖండ్ మ్యాచ్ డ్రా



మొహ్మద్ షాహిద్



రజిత్ బాగెల్ (87 పరుగులు)



రాహుల్ (21 పరుగులు)

మంగళగిరి: విజయ్ మర్చంట్ ట్రోఫీ అండర్ – 16లో రాజస్థాన్, ఉత్తరాఖండ్ మధ్య క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 82.1 ఓవర్లలో 266 పరుగులు చేసి ఆలౌటైంది. రాజస్థాన్ బ్యాట్స్‌మెన్ యశ్వంత్ భరద్వాజ్ 50 పరుగులు సాధించగా, షైఫన్ ఖాన్ 48 పరుగులు చేశాడు. ఉత్తరాఖండ్ బౌలర్లు నియాన్ త్యాగి, మొహ్మద్ షాహిద్‌లు చెరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 102.5 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. ఉత్తరాఖండ్ బ్యాట్స్‌మెన్‌లు అభిమన్యు 75 , అనయనేగి 71, కుషేగ్ర జెడ్ 54 పరుగులు సాధించారు. రాజస్థాన్ బౌలర్లు మిరాన్ ఖాన్, సుజాల్ పర్మార్ 3 వికెట్ల చొప్పున తీశారు. రాజస్థాన్ రెండవ ఇన్నింగ్స్‌లో 65 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 243 పరుగులు సాధించింది. రజిత్ బాగెల్ 86, రాహుల్ 81, సైఫన్ ఖాన్ 51 పరుగులు సాధించారు. దీంతో మ్యాచ్ డ్రా అయింది. ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించడంతో మూడు పాయింట్లు సాధించింది. రాజస్థాన్ ఒక పాయింట్ పొందింది.

ఐఏఎల్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో న్యాయవాదులు

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా సమితి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.నరసింహారావు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పర్చూరు నంద, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్దా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు చెరుకూరి సత్యనారాయణ, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ సీనియర్ ఈసీ ఎం ఎస్‌బీపీ రఘునాథ్, మాజీ అధ్యక్షులు కేవీకే సురేష్, సభ్యులు కె.నరసింహం, వేముల జయపాల్, కె.అంబిక, వి.లక్ష్మీతిరుపతమ్మ, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం టేబుల్, పాకెట్ క్యాలెండర్లను న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు అందజేశారు. కోర్టుకు సంబంధించిన సెలవు దినాలతో ముద్రించిన క్యాలెండర్ అందరికీ ఉపయుక్తంగా ఉందని వక్తలు తెలిపారు.